
సాక్షి
కాకినాడ

బుధవారం । 27 । మార్చి । 2024



రూ.51 వేల విరాళం

వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనానికి ఉమా సాయిప్రసాద్, రజనీ దంపతులు (విశాఖపట్నం) మంగళవారం రూ.51 వేల విరాళం అందజేశారు.



డెల్టాలకు 8,970 క్యూసెక్కులు

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద 8.30 అడుగుల వద్ద నీటిమట్టం కొనసాగుతోంది.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ (సా॥)	సెహరీ గురు (ఉ॥)
రాజమహేంద్రవరం	6.25	4.39
కాకినాడ	6.24	4.39
అమలాపురం	6.24	4.39

న్యూస్‌రీల్

ఎస్పీకి డీజీపీ గోల్డ్ డిస్క్ అవార్డు



ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ప్రతిష్టాత్మక డీజీపీ గోల్డ్ డిస్క్ అవార్డుకు ఎంపికయ్యారు. మంగళవారం రాష్ట్ర డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి ఈ అవార్డును ప్రకటించారు. శాంతిభద్రతల పరిరక్షణలో సతీష్‌కుమార్ అందించిన విశిష్ట సేవలకు గాను ఆయనను ఈ అవార్డు వరించింది. ఈ నేపథ్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది ఎస్పీని కలిసి అభినందనలు తెలిపారు.

రూ.56.95 లక్షల సరకులు సీజ్

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లాలో ఇప్పటి వరకూ ఎన్నికలకు సంబంధించి వివిధ రకాల అనుమతుల కోసం 161 దరఖాస్తులు రాగా, అందులో 95 మంజూరు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికా శుక్లా మంగళవారం తెలిపారు. 23 దరఖాస్తులు తిరస్కరించగా, 24 ప్రోగ్రెస్‌లో ఉన్నాయని, మరో 19 పరిశీలనలో ఉన్నాయని వివరించారు. జిల్లాలో రూ.56.95 లక్షల విలువైన సరకులను సీజ్ చేసినట్టు తెలిపారు. ఇందులో పోలీస్ శాఖ ద్వారా రూ.5.95 లక్షలు, స్టేట్ జీఎస్టీ, కమర్షియల్ టాక్స్ ద్వారా రూ.10.41 లక్షలు, విలువైన వస్తువులు సీజ్ చేసినట్టు చెప్పారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పబ్లిక్ ఆస్తుల వద్ద రాజకీయ ప్రకటనలు, ఫొటోలతో కూడిన ప్రకటనల హోర్డింగులు, జెండాలు వంటివి మొత్తం 31,664 తొలగించారన్నారు. ప్రైవేటు ప్రదేశాల్లో వాల్ రైటింగులు, పోస్టర్లు, బ్యానర్లు, జెండాలు వంటివి 10,909 తొలగించినట్టు పేర్కొన్నారు. జిల్లాలో సీ విజిల్ యాప్ ద్వారా 140 ఫిర్యాదులందాయని, వివిధ కారణాలతో, సక్రమంగా లేకపోవడంతో 85 ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. దీనిలో 41 ఫిర్యాదులు డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలని వచ్చాయని, వీటిని డ్రాప్ చేశామన్నారు. మిగిలిన 55 ఫిర్యాదులను ఆర్‌ఓలు పరిష్కరించినట్టు తెలిపారు. వీటిలో 52 ఫిర్యాదులు వంద నిమిషాల లోపు పరిష్కరించినట్టు చెప్పారు. గడచిన 24 గంటల్లో జిల్లాలో ఎక్సైజ్, ఎస్ఈబీ శాఖల ద్వారా 16 ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, 357.7 లీటర్ల అక్రమ మద్యాన్ని సీజ్ చేశారన్నారు. 16 కేసులు నమోదు చేసి, 13 మందిని అరెస్టు చేసినట్టు వివరించారు. జిల్లాలో 324 ఆయుధాలకు పరిమితులుండగా, అందులో 265 ఆయుధాలు డిపాజిట్ చేశారన్నారు. ఇంకా 59 ఎస్సెన్షియల్ సర్వీసులకు మినహాయింపు ఇచ్చినట్టు తెలిపారు. జిల్లాలో 23 ఎఫ్ఎస్‌టీ బృందాలు పని చేస్తున్నాయని, మూడు అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులు, ఐదు అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

వలంటీర్లపై టీడీపీ ఆరోపణలు అవివేకం



వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: వలంటీర్లపై టీడీపీ చేస్తున్న ఆరోపణలు అవివేకమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని లింగంపర్తిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి వలంటీర్లను టెర్రరిస్టులుగా పేర్కొంటూ ఆరోపణలు చేయడంపై వరుపుల మండి పడ్డారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ ఎటువంటి అవినీతికీ తావు లేకుండా, ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్లను విమర్శించడం టీడీపీ నాయకుల చేతగానితనానికి నిదర్శనమన్నారు. పార్టీలకతీతంగా ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లను విమర్శిస్తున్న టీడీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. టీడీపీ నేతలు ఇప్పటికైనా తమ తీరు మార్చుకోవాలన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నేత వరుపుల సూరిబాబు, తదితరులు ఉన్నారు.

లక్ష్మీనృసింహస్వామి ఆదాయం రూ.16.49 లక్షలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఎండోమెంట్స్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ నాగ మల్లేశ్వరరావు సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఫిబ్రవరి 27 నుంచి ఈ నెల 26వ తేదీ వరకూ 29 రోజులకు గాను రూ.16,49,294 లభించింది. వీటిలో మెయిన్ హుండీలు, గుర్రాలక్క అమ్మవారి ఆలయ హుండీ ద్వారా రూ.16,12,175, అన్నదాన హుండీల ద్వారా రూ.37,119 వచ్చినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. అలాగే అంతర్వేది దేవస్థానానికి అనుబంధంగా ఉన్న నీలకంఠేశ్వరస్వామి ఆలయ హుండీ ద్వారా రూ.15,491 లభించింది.

నిఘా ఉంది జాగ్రత్త

- సోషల్ మీడియాలో పోస్టు పెట్టే ముందు జర భద్రం
- ఎన్నికల నేపథ్యంలో సామాజిక మాధ్యమాలపైనా ఆంక్షలు
- ద్వేషపూరిత, అలజడులు రేపే పోస్టింగ్‌లు పెట్టేవారిపై కేసులు
- వివాదాస్పద పోస్టును ఫార్వర్డ్ చేసినా బాధ్యులే..
- సోషల్ మీడియా ప్రచారమూ పెయిడ్ న్యూస్ కిందకే..




కాకినాడ సిటీ: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సాగేలా ఎన్నికల కమిషన్ అన్ని చర్యలూ తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే సామాజిక మాధ్యమాలపైనా నిఘా వేసింది. ఎవరైనా ద్వేషపూరిత, అసత్య, సమాజంలో అలజడులు రేపే పోస్టింగ్‌లు పెడితే వెంటనే చర్యలు చేపట్టే ఏర్పాట్లు చేసింది.

అధికారుల నిరంతర పర్యవేక్షణ

మారిన టెక్నాలజీకి అనుగుణంగా సామాజిక మాధ్యమాల (వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రాం) ద్వారా కూడా రాజకీయ **నాయకులు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలోనే కొన్ని అరాచక శక్తులు విద్వేషాలు రాజేసి తమ స్వార్థానికి వాడుకునే అవకాశం** లేకపోలేదు. ఇలాంటి వారిని కట్టడి చేసేందుకు ఎన్నికల కమిషన్ నడుం బిగించింది. సోషల్ మీడియాపై అన్ని శాఖల అధికారుల ద్వారా నిఘా ఉంచింది. ఫొటో మార్ఫింగ్, అశ్లీల చిత్రాలు పంచుకోవడం, ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా సందేశాలు పంపడం, తదితర కార్యకలాపాలకు పాల్పడితే ఐటీ యాక్ట్–2000 సెక్షన్–67 కింద నమోదు చేస్తారు. నేరం రుజువైతే పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల జరిమానా విధిస్తారు. సోషల్ మీడియా గ్రూపు సభ్యులు అభ్యంతరకరమైన, వివాదాస్పద పోస్టులు, కామెంట్లు పెట్టినా వెంటనే **వాటిని అడ్మిన్ డిలీట్ చేయాలి. లేదంటే పోస్టింగ్ చేసిన సభ్యుడితో పాటు గ్రూపు అడ్మిన్** బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ఫిర్యాదు చేస్తే కేసు

సామాజిక మాధ్యమాల్లో ఎవరిపైనా వ్యక్తిగతంగా కానీ, పార్టీలపై కానీ, సంస్థలు, అధికార యంత్రాంగంపై కానీ అసత్య ప్రచారం చేయకూడదు. పోటీ చేసే అభ్యర్థులపై కార్టూన్స్, మీమ్స్, షార్ట్ వీడియోల ద్వారా అసత్య ప్రచారం చేసినట్లు ఎవరైనా ఆధారాలతో ఫిర్యాదు చేస్తే వెంటనే పోలీసులు, ఎన్నికల అధికారులు కేసులు నమోదు చేస్తారు. చట్ట విరుద్ధమైన ప్రకటనలు, రాజ్యాంగ ఉల్లంఘన, ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేసినా ఐపీసీ–504, 505 సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు. సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచార ప్రకటనలకు ముందు జిల్లా, రాష్ట్ర స్థాయిలోని మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ అనుమతి తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది.



పెయిడ్ న్యూస్ కింద పరిగణనలోకి..

ఇక.. ప్రస్తుత ఎన్నికల నిబంధన మేరకు పోలింగ్‌కు 48 గంటల ముందే సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేయాలి. సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ప్రచారం చేస్తే ఆయా పార్టీలు, అభ్యర్థులు వెచ్చిస్తున్న ఖర్చు వివరాల నివేదికను ఎన్నికల సంఘానికి అందజేయాల్సి ఉంటుంది. సోషల్ మీడియాలో ప్రచారం కూడా పెయిడ్ న్యూస్ కిందకే వస్తుంది. దీంతో ఈ ఖర్చు అభ్యర్థి ఎన్నికల ఖాతాల్లోకి వెళుతుంది.

హింసకు పాల్పడితే
కఠిన చర్యలు

ఏఎస్పీ భాస్కరరావు



తేటగుంటలో గ్రామస్తుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న ఏఎస్పీ భాస్కరరావు

తుని రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అసాంఘిక కార్యక్రమాలకు, హింసకు పాల్పడితే కఠిన చర్యలకు గురవుతారని జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎంజేవీ భాస్కరరావు హెచ్చరించారు. మంగళవారం రాత్రి తుని మండలం తేటగుంట, తొండంగి మండలం బెండపూడి గ్రామాల్లో జరిగిన పల్లెనిద్ర, ఎన్నికల అవగాహన సదస్సుల్లో ఏఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఎన్నికల నియమావళి, నిబంధనలు పాటించాలని, ఒక వ్యక్తి ఒకే ఓటును ప్రజాస్వామ్యబద్ధంగా వేయాలన్నారు. అక్రమాలకు, హింసకు పాల్పడేవారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. కేసు నమోదు చేసి శిక్షిస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో అనుమానితులు సంచరిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, సమాచారం అందించిన వ్యక్తుల పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రతి గ్రామంలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆయా గ్రామస్తుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. తుని రూరల్ సీఐ ఎస్‌వీవీఎస్.మూర్తి, ఎస్సైలు రమేష్‌బాబు, వినయ్‌ప్రతాప్, తేటగుంట సర్పంచ్ అత్తి నాగరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుండుబిల్లి వెంకటరమణ గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బయాలజీ పరీక్ష

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మంగళవారం బయాలజీ సైన్స్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 29,085 మంది హాజరుకాగా 1,118 మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి ఐదు కేంద్రాల్లో, ఇతర అధికారులు 50 కేంద్రాలు తనిఖీలు నిర్వహించారు. బుధవారం సోషల్ స్టడీస్ పరీక్ష యథావిధిగా నిర్వహిస్తున్నట్లు డీఈఓ రమేష్ తెలిపారు.

వేసవిలో తాగునీటికి సమగ్ర కార్యాచరణ

కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని, ఇందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వేసవి తాగునీటి సరఫరా ప్రణాళికపై కలెక్టర్ కృతికా శుక్లా గ్రామీణ నీటి సరఫరా, మునిసిపల్, పంచాయతీ, ఇరిగేషన్, వ్యవసాయం, పొల్యూషన్, పబ్లిక్ హెల్త్ తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాలోని మంచి నీటి చెరువులు, అందుబాటులో ఉన్న నీరు, రోజువారీ వినియోగం, భవిష్యత్తు అవసరాలు, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులతో చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత అవసరాలకు ఇబ్బంది లేకుండా చూస్తూ సీపీడబ్ల్యూఎస్, పీడబ్ల్యూఎస్ పథకాలకు సంబంధించిన 22 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తిస్థాయిలో ఏప్రిల్ 10 నాటికి నింపాలని సూచించారు. కాలువల మూసివేతకు ముందు చెరువులను 100 శాతం నింపేందుకు ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. మంచి నీటి సరఫరా స్కీములకు వెంటనే విద్యుత్ కనెక్షన్లు మంజూరు, బోర్‌వెల్స్, బోర్ల మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వివిధ పరిశ్రమల వ్యర్థ పదార్థాలు కాలువల్లోకి విడుదల చేయకుండా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఎం.శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు, వ్యవసాయ శాఖ జేడీ ఎస్ విజయ్‌కుమార్, డీపీవో కె.భారతి సౌజన్య, ఏపీఈపీడీసీఎల్ ఈఈ ప్రసాద్, ఇతర అధికారులు హాజరయ్యారు.



గ్రామీణ నీటి సరఫరా, ఇతర అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

ఓటర్లను పవన్ అవమానించడం తగదు

- డబ్బులకు అమ్ముడు పోయేవారిలా చిత్రీకరించడం బాధాకరం
- మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం
- ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన పిఠాపురం నియోజకవర్గం నాయకులు

కిర్లంపూడి: పిఠాపురం నియోజకవర్గంలో ఓటరుకు రూ.లక్ష చొప్పున ఇచ్చి ఓట్లు కొంటున్నారంటూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మాట్లాడడం అవమానకరంగా ఉందని కాపు ఉద్యమనేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లోని 12 గ్రామాల నుంచి కాపు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కులాలకు చెందిన సుమారు 300 మంది నాయకులు, కార్యకర్తలు మంగళవారం ముద్రగడను, యువ నాయకుడు గిరిబాబును వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ ముద్రగడను కలిశారు.

ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ ఓటర్లను డబ్బులకు అమ్ముడుపోయేవారిలా చిత్రీకరించడం బాధగా ఉందని చెప్పారు. వారు అమ్ముడు పోయినట్లుగా ఓటర్లు కూడా అమ్ముడుపోతారనుకోవడం సరికాదన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి రెట్టించిన ఉత్సాహంతో పని చేయాలన్నారు. ఆరు నెలలకొకసారి వచ్చి రాజకీయాలు చేసే వారికన్నా నిత్యం అందుబాటులో ఉండే పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతను, కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వీరి సహాయంతో పిఠాపురం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేలా కృషి చేస్తామన్నారు. అనంతరం సునీల్‌కు ఒక్కొక్కరినీ పేరుపేరునా పరిచయం చేశారు. గణేశుల రాంబాబు, గణేశుల లచ్చబాబు, గౌతు స్వామి, నడిగట్ల చింతలరావు, బండి సుబ్బులు, బుర్రా అనుబాబు, సత్యన్నారాయణ, అడపా రఘు, మొగిలి బాబ్జీ, గండేటి రాము, మొగిలి అయ్యారావు, టి.చిన్నారావు, గంధం నాగేశ్వరరావు, మొగిలి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



ముద్రగడతో సమావేశమైన పిఠాపురం నియోజకవర్గం నాయకులు, వీరితోపాటు పాల్గొన్న కాకినాడ ఎంపీ అభ్యర్థి సునీల్

ఆలయానికీ తప్పని ఎన్నికల కోడ్

- అన్నవరంలో శిలాఫలకాలపై ప్రజాప్రతినిధుల పేర్లు కనిపించకుండా చర్యలు
- కొత్త పనులు ప్రారంభించే అవకాశం లేదు
- అత్యవసర నిర్మాణాలకు ఎన్నికల అధికారుల అనుమతి తప్పనిసరి

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి కూడా ఎన్నికల కోడ్ తప్పలేదు. దీంతో దేవస్థానంలో గతంలో జరిగిన వివిధ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల శిలాఫలకాలపై ప్రజాప్రతినిధుల పేర్లు కనిపించకుండా తెల్లని గుడ్డ కప్పారు. దేవస్థానంలోని వివిధ సత్రాల వద్ద, ఇతర నిర్మాణాల వద్ద శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల శిలాఫలకాలు ఉన్నాయి. స్వామివారి ఆలయ పునర్నిర్మాణం జరిగాక 2012 మార్చి 14 న (ఫాల్గుణ బహుళ సప్తమి) నాడు శిఖర ప్రతిష్ఠ జరిగింది. అప్పుడు పెద్ద సంఖ్యలో మంత్రులు, ప్రజాప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ఆ కార్యక్రమాలకు సంబంధించిన రెండు శిలాఫలకాలు కూడా స్వామివారి ప్రధానాలయం దిగువన ఉన్నాయి. వాటిపై కూడా ప్రజాప్రతినిధుల పేర్లు కనిపించకుండా గుడ్డ కప్పారు.

నిర్మాణ పథకాలపై ఆంక్షలు

దేవస్థానంలోని వివిధ నిర్మాణాలపై కూడా ఎన్నికల కోడ్ ప్రభావం పడింది. ఎన్నికల నోటిఫికేషన్ రావడానికి ముందు ప్రారంభమైన నిర్మాణ పథకాలు కొనసాగడానికి ఎటువంటి ఆటంకం లేదు. అయితే కొత్తగా ఏవైనా నిర్మాణాలు ప్రారంభించాలన్నా, టెండర్లు పిలవాలన్నా ఎన్నికల అధికారుల అనుమతి తప్పనిసరి అని దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ తెలిపారు. ప్రస్తుతం సత్యదేవుని నమూనా ఆలయం పనులు జరుగుతున్నాయి. వాటికి ఎటువంటి అభ్యంతరాలు లేవు. కాని ఇటీవల ధర్మకర్తల మండలి సమావేశంలో ఘాట్‌రోడ్ నుంచి వనదుర్గ గుడి వరకు గల రోడ్డుపై గోతులు పూడ్చి పిట్టగోడ నిర్మించేందుకు రూ.34 లక్షలతో పనులు చేసేందుకు ప్రతిపాదనలు తీర్మానం చేశారు. ఆ పనులు చేపట్టే వీలు లేదు. రూ.కోటి వ్యయంతో దేవస్థానం దత్తత ఆలయం కోరుకొండ దేవస్థానంలో మెట్లదారి మరమ్మతులు ఇతర పనులు చేపట్టాలని అనుకున్నారు. ఆ పనులు ఎన్నికల కోడ్ కారణంగా ప్రారంభించే అవకాశం లేదు. అత్యవసరమైతే ఎన్నికల అధికారుల అనుమతి తప్పనిసరి అని అధికారులు తెలిపారు.



ఆలయం వద్ద శిలా ఫలకాలకు కప్పిన వస్త్రం



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు (ఫైల్)

సిరా చుక్కపై నిరాసక్తి

- ఓటుహక్కును వినియోగించుకోని ఓటర్లు
- 2014లో 7,76,420 మంది, 2019లో 8,28,977 మంది దూరం
- పట్టణాల్లోనే అత్యధికం

రాయవరం: ఓటు అనే రెండక్షరాలకు పాలకుల తలరాతను మార్చే శక్తి ఉంది. దానిని సద్వినియోగం చేసుకుంటే సమాజాన్ని దిశానిర్దేశం చేసే మంచి నాయకులను ఎన్నుకోవచ్చు. మన భవిష్యత్తును మనమే నిర్ణయించుకోవచ్చు. అయితే, ఓటుకు ఉన్న శక్తిని తెలుసుకోక పోవడంతో దానిని వినియోగించుకునేందుకు పలువురు ఓటర్లు నిరాసక్తత చూపిస్తున్నారు. కుల, మత, ప్రాంత, లింగ, జాతి, భాష, ఆర్థిక బేధ భావం లేకుండా దేశంలోని 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 328 ఈ అవకాశాన్ని కల్పించింది. దేశ, రాష్ట్ర ప్రభుత్వాల భవిష్యత్తును నిర్ణయించేందుకు ఓటు ఎంతో ఉపయోగపడుతుంది.

ఆసక్తి లేక.. : అయితే రాజ్యాంగం కల్పించిన ఓటును వినియోగించుకోవడంలో జనం నిరాసక్తి కనబరుస్తున్నారు. ఓటు హక్కు వినియోగం, ఆవశ్యకత, దాని విలువను తెలియజేసేందుకు ఎన్నికల సంఘం జాతీయ ఓటర్ దినోత్సవం నిర్వహించడంతో పాటుగా, సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఓటర్లకు వివిధ రూపాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అయినా ఎక్కువ మంది ఓటర్లు నిరాసక్తి కనబర్చడం గమనార్హం. ముఖ్యంగా పట్టణ ప్రాంత ఓటర్లే నిరాసక్తత కనబరుస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలో 2014 ఎన్నికల్లో 7,76,420 మంది ఓటర్లు ఓటును వినియోగించుకోలేదు. 19 నియోజకవర్గాల్లో మొత్తం 37,73,322 మంది ఓటర్లకు గాను 29,96,902 మంది మాత్రమే ఓటు వేశారు. కాకినాడ, రాజమహేంద్రవరం వంటి పట్టణాల్లో అధికంగా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోలేనట్లు లెక్కలు చెబుతున్నాయి. అలాగే 2019 ఎన్నికల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో 19 నియోజకవర్గాల పరిధిలో 42,06,253 ఓటర్లకు 33,77,276 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 8,28,977 మంది ఓటు వేయలేదు.

2014 సార్వత్రిక ఎన్నికలలో ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	ఓటు వేయనివారు
తుని	1,97,617	1,59,970	37,647
ప్రత్తిపాడు	1,84,784	1,48,075	36,709
పిఠాపురం	2,13,121	1,69,330	43,791
కాకినాడ రూరల్	2,21,660	1,65,338	56,322
పెద్దాపురం	1,94,904	1,50,357	44,547
అనపర్తి	2,03,263	1,74,274	28,989
కాకినాడ సిటీ	2,07,036	1,40,523	66,513
రామచంద్రపురం	1,81,617	1,60,133	21,484
ముమ్మిడివరం	2,08,196	1,73,378	34,818
అమలాపురం	1,91,440	1,49,928	41,512
రాజోలు	1,74,027	1,35,230	38,797
పి.గన్నవరం	1,83,050	1,42,815	40,235
కొత్తపేట	2,23,230	1,88,051	35,179
మండపేట	1,95,915	1,71,609	24,306
రాజానగరం	1,87,137	1,60,757	26,380
రాజమహేంద్రవరం సిటీ	2,29,650	1,58,317	71,333
రాజమహేంద్రవరం రూరల్	2,26,990	1,67,626	59,364
జగ్గంపేట	1,98,855	1,66,213	32,642
రంపచోడవరం	1,50,830	1,14,978	35,852
మొత్తం	37,73,322	29,96,902	7,76,420

2019లో ఎన్నికలలో ఇలా..

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	ఓటు వేయనివారు
తుని	2,13,055	1,77,375	35,680
ప్రత్తిపాడు	2,02,808	1,64,915	37,893
పిఠాపురం	2,29,729	1,86,682	43,047
కాకినాడరూరల్	2,49,109	1,84,507	64,602
పెద్దాపురం	2,01,975	1,62,928	39,047
అనపర్తి	2,13,511	1,86,710	26,801
కాకినాడ సిటీ	2,55,773	1,71,604	84,169
రామచంద్రపురం	1,93,867	1,68,891	24,976
ముమ్మిడివరం	2,29,600	1,92,043	37,557
అమలాపురం	2,03,768	1,69,382	34,386
రాజోలు	1,86,903	1,49,605	37,298
పి.గన్నవరం	1,89,385	1,56,212	33,173
కొత్తపేట	2,41,645	2,03,938	37,707
మండపేట	2,14,388	1,86,429	27,959
రాజానగరం	2,01,260	1,76,785	24,475
రాజమహేంద్రవరం సిటీ	2,53,184	1,67,604	85,580
రాజమహేంద్రవరం రూరల్	2,54,432	1,88,827	65,605
జగ్గంపేట	2,11,481	1,81,127	30,354
రంపచోడవరం	2,60,380	2,01,712	58,668
మొత్తం	42,06,253	33,77,276	8,28,977

క్లుప్తంగా

చెక్‌పోస్టులో రూ.4 లక్షల సీజ్


నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు

గోపాలపురం: సార్వత్రికల ఎన్నికల నేపథ్యంలో మండలంలోని జగన్నాథపురంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద కారులో తరలిస్తున్న రూ.4 లక్షలను పట్టుకున్నట్టు ఎస్సై కె.సతీష్ కుమార్ మంగళవారం తెలిపారు. ఖమ్మం నుంచి విశాఖపట్నానికి ఐనసూరి వర్షిత్ ఈ సొమ్మును తీసుకువెళుతున్నట్టు గుర్తించామన్నారు. అతడి వద్ద ఎటువంటి పత్రాలు, రశీదులు లేకపోవడంతో రూ.4 లక్షలు, కారును సీజ్ చేసినట్టు తెలిపారు. తనిఖీల్లో ఏఎస్సై కె.శోభనాద్రి, ఈటీపీఆర్‌డీ కె.సురేష్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మరో రూ.4.05 లక్షలు

తుని రూరల్: తేటగుంట శివారు ఎర్ర కోనేరు పెట్రోల్ బంకు నుంచి తుని ఎస్‌బీఐ ఏడీబీ బ్యాంకుకు ఎటువంటి రశీదు లేకుండా తీసుకు వెళుతున్న రూ.4,05,770ను సీజ్ చేసినట్టు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, ఎంపీడీఓ రవికుమార్ తెలిపారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా సీజ్ చేసిన మొత్తాన్ని డిపాజిట్ చేస్తామన్నారు. జిల్లా మానిటరింగ్ సెల్‌లో తగిన ఆధారాలు చూపించి, నగదును పొందవచ్చన్నారు. అనుమతి, ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు, ఇతరత్రా ప్రోత్సాహక నగలు, వస్తువులు తరలించడం ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్టే అన్నారు.

విద్యార్థిని మృతి

కాకినాడ రూరల్: ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థిని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూరంగిలోని మహాలక్ష్మి నగర్‌కు చెందిన విద్యార్థిని తాడి లావణ్య (17) ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసింది. స్థానిక యువకుడితో చనువుగా మాట్లాతుందని తల్లిదండ్రులు ఆమెను మందలించారు. దీంతో మనస్తాపానికి గురై సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. తండ్రి గణేష్ ఫిర్యాదు మేరకు ఎస్సై మణికుమార్ కేసు నమోదు చేశారు.

క్రీడా శిబిరాల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: ఏపీ క్రీడాప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు మే ఒకటి నుంచి 31వ తేదీ వరకూ జిల్లాలో బాలలకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామని కోనసీమ జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి పీఎస్ సురేష్ కుమార్ తెలిపారు. ఆసక్తి కల క్రీడా అసోసియేషన్లు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. క్రీడ పేరు, మైదానం, ఇన్‌చార్జి, మొబైల్ నెంబర్ తదితర వివరాలతో ఈనెల 30వ తేదీ లోపు అమలాపురంలోని బాలయోగి స్టేడియంలో గల కార్యాలయానికి దరఖాస్తులు పంపాలన్నారు. ఇతర వివరాలకు 79933 29433 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కాపాడితేనే ప్రగతి


పశువుల మకాం చుట్టూ దోమల నివారణకు కట్టిన తెరలు


పశువులు సేద తీరేందుకు నిర్మించిన నీటి కొలను

పాడి-పంట

- పశువుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు
- పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం
- పాడి రైతులకు అధికారుల సూచనలు

ఆలమూరు: వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. పశువుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. వాటిని రైతులందరూ సద్వినియోగం చేసుకుంటే పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుంది. తద్వారా ఆదాయమూ పెరుగుతుంది. ప్రకృతి వైపరీత్యాల ప్రభావంతో పాటు వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల కారణంగా ఏడాది పొడవునా దోమలు విజృంభిస్తూ పశువులను తీవ్ర అనారోగ్యానికి గురి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పశువుల సంరక్షణకు పాడి రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆలమూరు పశుసంవర్ధకశాఖ ఏడీ ఎల్.అనిత చెబుతున్నారు. దీనివల్ల అధిక పాల దిగుబడితో పాటు పశువులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ముఖ్యంగా పశువుల సంరక్షణ, పరిశుభ్రతతోనే ఇది సాధ్యమన్నారు. ఈ సందర్భంగా పలు జాగ్రత్తలు తెలియజేశారు.

దోమలతో కలిగే సమస్యలు

- దోమల దాడికి గురైన పశువులకు అనేక శారీరక సమస్యలు సంభవించి, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి.
- పశువుల పాల దిగుబడిపై తగ్గుతుంది. పాలలో నాణ్యత కూడా లోపిస్తుంది.
- పశువులకు ఆకలి మందగించి, ఆహారాన్ని సరిగ్గా తీసుకోలేవు.
- తరచూ జ్వరాల బారిన పడతాయి. కనీస ఉష్ణోగ్రతలు పెరిగిపోతాయి.
- చర్మంపై తరచూ దురద పుట్టడం వల్ల పుండ్లు పడే అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో పశువైద్యులను సంప్రదించాలి.

సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు

- దోమల ప్రభావం ఎట్టి పరిస్థితుల్లోనూ పశువులపై లేకుండా పశుపోషకులు జాగ్రత్తలు పాటించాలి.
- పశువుల శాలల్లో మురుగు, వ్యర్థాలు నిల్వ ఉండకుండా సిమెంట్‌తో ఫ్లోరింగ్ చేయించుకోవాలి.
- పశువులను ఉంచే పాక, షెడ్డులో దోమలు ఉండకుండా చర్యలు తీసుకోవాలి. చుట్టూ దోమతెరలను కట్టాలి. సాయంత్రం వేప ఆకుతో పొగ పెట్టాలి.
- షెడ్డును ఎప్పటికప్పుడు మంచినీటితో కడిగి పరిశుభ్రంగా ఉంచాలి.
- కడిగిన నీరు బయటకు పోయేందుకు ప్రత్యేక మార్గం ఏర్పాటు చేసుకోవాలి.
- పశువులు నీరు, కుడితి తాగే తొట్టెలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- మేత తొట్టెల ఎత్తు మూడు అడుగులకు మించకుండా ఉండాలి.
- పశువుల మకాంలో దోమ తెరలతో పాటు సీలింగ్ ఫ్యాన్లు బిగించాలి.
- దోమల నివారణకు ఉపయోగించే మెషీన్‌లను వాడాలి.

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి



మేలుజాతి పశుపోషకులు పశువులకు ఎటువంటి వ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలి. పశువులను దోమలు కుట్టకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. పశువుల ఆరోగ్యంపై ఏమాత్రం అశ్రద్ధ వహించినా భారీ నష్టం జరిగే అవకాశం ఉంది.

– ఎల్.అనిత, పశుసంవర్ధకశాఖ ఏడీ, ఆలమూరు

సూచనలు పాటిస్తున్నాం



పశుసంవర్ధక శాఖ సూచనలు, సలహాలు పాటిస్తూ పశువుల పెంపకం సాగిస్తున్నాం. పశువుల సంరక్షణకు చర్యలు తీసుకోవడం ద్వారా అధిక పాల దిగుబడి సాధించడంతో పాటు పశువుల అనారోగ్యం బారిన పడకుండా చూసుకుంటున్నాం.

– తోరాటి వెంకన్న, పాడి రైతు, సంధిపూడి

నేటి నుంచి జేఎన్‌టీయూకేలో ఇన్నోవేషన్ ఫెయిర్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకేలో బుధ, గురువారాల్లో ఇన్నోవేషన్ ఫెయిర్ – 24 జరగనుంది. యూనివర్సిటీ డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ నాలెడ్జ్ టెక్నాలజీ ఆర్‌కే వ్యాలీ, నూజివీడు, నాగార్జున యూనివర్సిటీ, నిట్ ఏపీ, డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ యూనిర్సిటీ, నన్నయ్య విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 200 ప్రాజెక్టులను ఇక్కడ ప్రదర్శించనున్నారు. కార్యక్రమాన్ని బుధవారం జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాద రాజు, ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డాక్టర్ పద్మరాజు ప్రారంభిస్తారు. ఉత్తమ ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులకు గురువారం సాయంత్రం బహుమతులు అందజేస్తారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలకు చెందిన డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులందరూ సందర్శించవచ్చని గోపాలకృష్ణ తెలిపారు.

విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు


డెయిరీలో తనిఖీలు చేస్తున్న అధికారులు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు మంగళవారం స్థానిక టి.నగర్‌లోని లక్ష్మీగణేష్ మిల్క్ డెయిరీలో తనిఖీలు నిర్వహించారు. షాపులోని రెండు నెయ్యి నమూనాలను, ఒక్క లూస్ బట్టర్‌ను పరీక్ష కోసం సేకరించారు. ప్యాకింగ్ లైసెన్స్ లేకపోవడం, ఐదు కిలోల పెరుగు బకెట్లపై వివరాలు లేకపోవడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు మూడు కేసులు నమోదు చేశారు. అలాగే నాలుగు గృహావసరాల సిలిండర్లను వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నందున 6 ఏ చట్టం కింద కేసు నమోదు చేసి, ఆ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాజమహేంద్రవరం ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నామన్నారు. నెయ్యి, నూనె తదితర వాటిని అనుమతులు లేకుండా తయారు చేసినా, విక్రయించినా నేరమన్నారు. సదరు వ్యక్తులు / సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలో విజిలెన్స్ అధికారులు ముత్యాలు నాయుడు, నాగ వెంకట రాజు, జగన్నాథరెడ్డి, మహేష్, నవీన్ కుమార్, లీగల్ మెట్రాలజీ అధికారి బాలాజీ, ఫుడ్ సేఫ్టీ అధికారి రత్తయ్య జీవానందం, శివ పాల్గొన్నారు.

గోదావరిలో మునిగి యువకుడి మృతి

సీతానగరం: గోదావరిలో స్నానానికి దిగి ఓ యువకుడు మృతి చెందాడు. ముగ్గళ్ల ఇసుక ర్యాంపు వద్ద మంగళవారం ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. రఘుదేవపురానికి చెందిన గోపల శివశంకర్ (19) మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో తన స్నేహితులతో కలిసి ముగ్గళ్ల ఇసుక ర్యాంపు వద్ద గోదావరిలో స్నానానికి దిగాడు. అతడి ముగ్గురు స్నేహితులు ఒడ్డున స్నానం చేస్తుండగా, శివశంకర్ మరికొంత ముందుకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తూ మునిగిపోతూ కేకలు వేశాడు. అతడి స్నేహితులు రక్షించే ప్రయత్నం చేసినా ఫలిత లేకపోయింది. విషయం తెలుసుకున్న ఏఎస్సై సమర్పణరావు, సచివాలయ మహిళా పోలీస్ తాడి ప్రసన్న, వీఆర్వో చిన్నా సంఘటన స్థలానికి చేరుకున్నాడు. శివశంకర్ కోసం గాలింపు చర్యలు చేపట్టగా, సాయంత్రం 5 గంటలకు అతడి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీఆర్వో చిన్నా ఫిర్యాదు మేరకు ఎస్సై టి.రామకృష్ణ కేసు నమోదు చేశారు. కాగా.. శివశంకర్ తల్లిదండ్రులు కొన్ని రోజుల క్రితం పోలవరం నుంచి రఘుదేవపురం వచ్చారు. బంధువుల ఇంట్లో ఉంటూ పనులకు వెళుతున్నారు. కుమారుని మరణ వార్త విని బోరున విలపించారు.


శివశంకర్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పాఠశాల వంటషెడ్డులో మంటలు


వంట షెడ్డును పరిశీలిస్తున్న విద్యాశాఖాధికారులు తిరుమలదాస్, అప్పారావు

దేవరపల్లి: స్థానిక బస్టాండ్ సమీపంలోని మండల ప్రాథమిక మెయిన్ పాఠశాలలో బుధవారం ఉదయం 11 గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండుతున్న సమయంలో సిలిండర్ నుంచి గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. అవి పక్కనే ఉన్న మరో సిలిండర్‌కు కూడా వ్యాపించి, పెద్ద ఎత్తున ఎగిసిపడ్డాయి. మంటలను చూసిన విద్యార్థులు, వంట మహిళలు భయంతో పరుగులు తీశారు. ఉపాధ్యాయులు, వంట మహిళలు వెంటనే స్పందించి మంటలను అదుపు చేశారు. పొయ్యిలపై ఉన్న అన్నం, కోడిగుడ్లు, ఆహార పదార్థాలు పాడైపోయాయి. ఘటనా స్థలాన్ని మండల విద్యాశాఖ అధికారులు ఎం.తిరుమలదాస్, కేఆర్ఎస్‌వీవీ అప్పారావు పరిశీలించారు. విద్యార్థులకు ప్రత్యామ్నాయంగా వంటలు చేయించి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. సుమారు రూ.5 వేలు నష్టం జరిగినట్టు అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిన పంపించినట్టు తెలిపారు. రెండు గ్యాస్ సిలిండర్లు, మూడు పొయ్యిలు, వంట పాత్రలు కాలిపోయాయన్నారు.

సాగర తీరంలో రక్షణ దళాల విన్యాసాలు


సూర్యారావుపేట బీచ్‌లో నేవీ వాహనాలు


బీచ్ రోడ్డులో పోలీసుల బందోబస్తు

- కాకినాడ చేరుకున్న అమెరికా దళాలు
- పోలీసుల బందోబస్తు

కాకినాడ రూరల్: భారత, అమెరికా రక్షణ దళాల సంయుక్త విన్యాసాలు కాకినాడ తీరంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఇటీవల విశాఖపట్నంలో ప్రారంభించిన ఈ విన్యాసాలను కాకినాడ తీరంలో కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. కాకినాడ రూరల్ సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్, ఓల్డ్ ఎన్టీఆర్ బీచ్‌లను ఇప్పటికే తమ ఆధీనంలోకి తీసుకున్న తూర్పు తీర నావికాదళం ఏర్పాట్లలో నిమగ్నమైంది. భారత త్రివిధ దళాలతో పాటు యూఎస్ దళాలు టైగర్ ట్రాయంఫ్ పేరిట వీటిని చేపడుతున్నాయి. దీనిలో భాగంగా యూఎస్ దళాలు మంగళవారం కాకినాడకు చేరుకున్నాయి. బుధ, గురు, శుక్రవారాల్లో సముద్రంలో పాటు ఒడ్డున కూడా పూర్తిస్థాయిలో సంయుక్త విన్యాసాలు నిర్వహించనున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్పీ సతీష్ కుమార్ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కాకినాడ – ఉప్పాడ మధ్య బీచ్‌రోడ్డులో వాహనాల రాకపోకలు పూర్తిగా నిషేధించారు. ప్రయాణికులు అచ్చంపేట జంక్షన్, పిఠాపురం మీదుగా రాకపోకలు సాగించాలని రూరల్ సీఐ శ్రీనివాస్, తిమ్మాపురం ఎస్సై రవీంద్ర బాబు సూచించారు.

శ్రీకృష్ణ మందిరానికి రూ.లక్ష విరాళం


ప్రభూజీకి చెక్కు అందజేస్తున్న జగన్నాథం దంపతులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్మాణానికి అమలాపురం వాస్తవ్యులు గంధం జగన్నాథం దంపతులు రూ.లక్ష విరాళం సమర్పించారు. ఈ సొమ్మును ఆలయ నిర్వాహకుడు సుందర శ్రీనివాసదాసు ప్రభూజీకి అందజేశారు. ఈ సందర్భంగా దాతలను పలువురు అభినందించారు.

జలవనరులను కాపాడుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యూషకుమారి

ప్రకాశం నగర్ : బాధ్యతతో కూడిన నీటి వినియోగ అలవాట్లను అలవరుచుకోవాలని, జలవనరులను కాలుష్యం నుంచి పరిరక్షించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి కె.ప్రత్యూషకుమారి అన్నారు. మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని జల వనరుల సంరక్షణ, జనన, మరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీ మొదలగు అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కె.ప్రత్యూషకుమారి మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని 51–ఏ(జి) అధికరణ ప్రకారం పర్యావరణాన్ని పరిరక్షించడం, మెరుగుపరచడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆమె తెలిపారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ విధులు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సేవల గురించి వివరించారు. ఈ సదస్సులో కాకినాడ జిల్లా డ్వామా అధికారి ఎ.వెంకట లక్ష్మి, కాలుష్య నియంత్రణ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీహెచ్ఎల్ సందీప్ రెడ్డి, ఆర్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షేక్ మదార్ షాహ అలీ, ఐపీవో సూర్య ప్రకాష్, జలవనరుల, ఇతర అనుబంధ శాఖల అధికారులు, వార్డు సెక్రటరీలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన లారీ


అంబాజీపేటలో లారీ ఢీ కొట్టడంతో ధ్వంసమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభం, వైర్లు

అంబాజీపేట: స్థానిక బస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం లారీ బలంగా ఢీకొట్టి పక్కనే ఉన్న డ్రైనేజీలోకి ఒరిగిపోయింది. అంబాజీపేట నుంచి ముక్కామల వైపు వెళుతున్న లారీ ఢీకొనడంతో విద్యుత్ స్తంభంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ వైర్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పక్కనే ఉన్న బొంతు స్వామి ప్రహరీ పాక్షికంగా దెబ్బతింది. విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టే సమయంలో విద్యుత్ సరఫరా ఉందని, ఒక్కసారిగా వైర్లు తెగిపోవడంతో సరఫరా నిలిచిపోయిందని స్థానికులు చెప్పారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఎవరికి ఏ ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. లారీ డ్రైవర్‌కు రెప్పపడటంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. శిథిలమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాన్ని, వైర్లను విద్యుత్ శాఖ అధికారులు తమ సిబ్బందితో పునరుద్ధరించారు.

టాస్క్‌ఫోర్స్ బృందం పరిశీలన

కడియం: జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని, సచివాలయం–2ను తనిఖీ చేశారు. వైద్య విభాగం ద్వారా అందుతున్న పలు సేవలను ఆరా తీశారు. రక్తహీనత ఉన్న గర్భవతులు, కిశోర బాలికలకు అందిస్తున్న సేవలు, స్కూలు వెలుపల వైద్య సిబ్బంది అందిస్తున్న సేవల వివరాలను సంబంధిత లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి తెలుసుకున్నారు. అలాగే రికార్డులను పరిశీలించారు. ఈ వైద్య టాస్క్‌ఫోర్స్ బృందంలో నేషనల్ హెల్త్ మిషన్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ సంధ్యారాణి, డిస్ట్రిక్ట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ కుమార స్వామి, డీపీహెచ్ఎన్ వసంత లక్ష్మి ఉన్నారు. స్థానిక వైద్య సిబ్బంది ఆయా వివరాలను తెలిపారు.

లారీ ఢీకొని విద్యార్థి మృతి

రాజమహేంద్రవరం రూరల్: లారీ ఢీకొని విద్యార్థి మృతి చెందిన సంఘటన మంగళవారం మధ్యాహ్నం దివాన్ చెరువులో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. చాగల్లు మండలం ఊనగట్ల గ్రామానికి చెందిన అక్కాబత్తుల స్టీఫెన్ బాబు (13) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల తల్లిదండ్రులు చనిపోవడంతో పెదనాన్న కుమారుడు, అన్నయ్య అక్కాబత్తుల విజయ్ కుమార్ వద్ద ఉంటున్నాడు. కాగా.. స్టీఫెన్‌బాబుకు అనారోగ్యంగా ఉండడంతో మంగళవారం ఉదయం బైక్‌పై విజయకుమార్, రాజు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. తిరిగి ప్రయాణంలో మధ్యాహ్నం 2.30 గంటలకు దివాన్ చెరువులోని బ్రిడ్జికొంటీ, ఫ్రూట్స్ మార్కెట్ మధ్యకు వచ్చేసరికి వెనుక నుంచి లారీ అతివేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై నుంచి ముగ్గురు కిందపడిపోయారు. స్టీఫెన్ బాబుకు తీవ్ర గాయాలు, విజయ కుమార్, రాజులకు స్వల్పగాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో స్టీఫెన్‌బాబును జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం 5 గంటలకు మృతి చెందాడు. విజయ కుమార్ ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై బి.శ్రీను కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అట్రాసిటీ కేసులో ఐదుగురి అరెస్టు

రంగంపేట: ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముప్పిడి వెంకటేష్, అతడి స్నేహితులను జి.దొంతమూరు గ్రామానికి చెందిన దుప్పలపూడి రాజేష్, బి.సురేష్, తిక్కిశెట్టి మణికంఠ, దుప్పలపూడి అబ్బాయికాపు, కర్రి జయరాజులు కులం పేరుతో దూషించి దాడి చేసి కొట్టారని వెంకటేష్ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి మంగళవారం వారిని అరెస్టు చేసి పెద్దాపురం కోర్టుకు తరలించామని తెలిపారు.

వాడపల్లికి గోవింద మాలధారుల పాదయాత్ర


వాడపల్లికి పాదయాత్రగా వెళుతున్న గోవింద మాలధారులు


స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న పండితులు

రావులపాలెం: స్థానిక శ్రీ అలివేలు మంగ పద్మావతీ ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి 15వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా పదో రోజు మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాడపల్లి వేంకటేశ్వర స్వామి దర్శనార్థం గోవింద మాలధారులు వాడపల్లి పాదయాత్రగా తరలివెళ్లారు. దారి పొడవునా భిక్షాటన చేస్తూ యాత్రను కొనసాగించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు తరలి వచ్చి, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే రాత్రికి స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ పాలక మండలి చైర్మన్ పడాల పెద వెంకటరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.